VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ శనివారం 24 అక్టోబర్ 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 108



స్టాక్ మార్కెట్‌కు వరుస షాక్‌లు..

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం.

- కరువు ఎదుర్కోవడంలో భాగస్వాములు కావాలి
- పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- ఎల్‌నినోపై టీపీసీసీ ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 23 : రాష్ట్రంలో రానున్న రోజుల్లో ఎదురయ్యే ఎల్‌నినో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు, ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎల్‌నినో అనేది భూతం కాదని, తీవ్రమైన కరువు పరిస్థితులని తెలిపారు. కేవలం మన రాష్ట్రమే కాక మహారాష్ట్ర,

మిగతా 2వ పేజీలో..



## కరువును ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ

- ప్రభావిత మండలాల గుర్తింపు నుంచి నీటి సంరక్షణ వరకు పటిష్ట చర్యలు
- తాగు, సాగునీటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
- అన్ని శాఖలూ అప్రమత్తంగా ఉండాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

## తుమ్మిడిహెట్టిపై త్వరలో చర్చలు

- 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి ఒప్పించేలా వాదనలు
- చర్చలకు సానుకూలత తెలిపిన మహారాష్ట్ర సీఎం
- ఏదుల నుంచే డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీళ్లు
- పాలమూరు నీటికి గండి పడకుండా అదనపు నీటి తరలింపు
- శ్రీశైలం నుంచి ఏదుల వరకు అదనంగా 0.6 టీఎంసీల ఎత్తిపోతలు
- నీటిపారుదల ప్రాజెక్టుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## నేరాల కట్టడికి ఉమ్మడి కార్యాచరణ

- సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు ప్రత్యేక సెక్రటేరియట్
- సైబర్ నేరాలు, డ్రగ్స్ అక్రమ రవాణాపై సమన్వయంతో పోరు
- పోలీసు సాంకేతికత, నేర నియంత్రణ విధానాలపై దక్షిణాది రాష్ట్రాల దృష్టి
- సైబర్ బాధితులకు రూ.69.4 కోట్ల రికవరీ

3




## భద్రతే అభివృద్ధికి పునాది

- తెలంగాణ ప్రగతికి టీజీఎస్‌పీఎఫ్ రక్షణ కవచం
- 67 ప్రభుత్వ కీలక సంస్థలకు టీజీఎస్‌పీఎఫ్ భద్రత
- టీజీఎస్‌పీఎఫ్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



3

## కాంగ్రెస్ ది అసమర్థ పాలన



- భరోసా ఇవ్వడం మానేసి బెదిరింపులా?
- ఆరునెలల్లో తీసుకున్న కరువు నివారణ చర్యలేంటి?
- నీళ్లు ఇవ్వలేమనడం పాలనా దక్షత అనిపించుకోదు
- విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు
- అడ్డగోలుగా పెరుగుతున్న బియ్యం ధరలు
- ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలా?
- రేవంత్ వ్యాఖ్యలపై హరీష్ రావు ధ్వజం

3

## ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై ఈడీ ఉక్కుపాదం

- హైదరాబాద్, విజయవాడల్లో ఏజెంట్లు, హవాలా నిర్వాహకులపై సోదాలు
- 200కు పైగా షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లింపు
- క్రిప్టోకరెన్సీ రూపంలో దుబాయ్‌కు నగదు తరలింపు
- ఎడ్‌సోమ్ ఫిన్‌టెక్ వ్యవస్థాపకుడు రాంధాని అరెస్టు

2

## 'ఖేలో ఇండియా' నిర్వహణకు పక్కా కార్యాచరణ

- గ్రామీణస్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారుల గుర్తింపు
- క్రీడలు, యువజనుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి



3

## చైనాకు క్లీన్‌చిట్‌లు..

### దేశానికి అసలు రిపోర్ట్ ఏది మోదీ సాబ్?

వెబ్ డెస్క్, అక్టోబర్ 23:

అరుణాచల్‌లో చైనా సైన్యంతో ఘర్షణలపై కేంద్రం సైలెంట్.. కాంగ్రెస్ మాత్రం ఫుల్ ఫైర్ ..ప్రధాని మోదీ చైనాకు ఇప్పటికే చాలా క్లీన్‌చిట్‌లు ఇచ్చేశారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఐటీబీపీ డీజీ శత్రుజీత్ కపూర్ ఘర్షణలు ఇంకా కొనసాగుతు న్నా యన్న వ్యాఖ్యలను ఎక్స్‌లో షేర్ చేస్తూ, అసలు గ్రౌండ్ రియాల్టీ ఏంటో దేశానికి చెప్పాలని మోదీని డిమాండ్ చేశారు.



## విభజన శక్తులకు చెక్.. 2047 వికసిత్ భారత్ టార్గెట్!



వెబ్ డెస్క్, అక్టోబర్ 23:

సమాజంలో చీలికలు పెట్టే శక్తులకు ఎగనెస్ట్ గా అందరూ ఒక్కటవ్వాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఢిల్లీలో 'చిన్మయ అమృత్ మహోత్సవ్' గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రారంభించిన మోదీ.. ఆత్మనిర్భర్ భారత్ దిశగా జనాల్లో స్ఫూర్తి నింపాలన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ కల సాకారం కావాలంటే ప్రతి పౌరుడు యాక్టివ్‌గా పని చేయాలని చెప్పారు. చిన్మయ మిషన్ ఓ సంస్థ మాత్రమే కాదని, అదొక ఆలోచనా విధానమని కొనియాడారు. వ్యక్తిగత ప్రగతి దేశ అభివృద్ధికి ఉపయోగపడాలంటూ స్వామి చిన్మయానంద బోధనలను మోదీ గుర్తుచేశారు.



## ఆర్మీ చేతికి 'నాగాస్త్ర-2'.. శత్రు ట్యాంకులకు ఇక దడదడే !

వెబ్ డెస్క్, అక్టోబర్ 23:

భారత్ రక్షణ రంగంలో మరో స్వదేశీ అస్త్రం ఎంట్రీ ఇచ్చింది .. నాగ్‌పుర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ సంస్థ రూపొందించిన 'నాగాస్త్ర-2' డ్రోన్ వ్యవస్థను భారత సైన్యానికి అప్పగించింది. పగలు, రాత్రి నిఘా పెట్టే కెమెరాలతో శత్రువుల కదలికలపై కన్నేసే ఈ కామికాజే డ్రోన్, లక్ష్యంపై ఆత్మాహుతి దాడి చేయగలదు. గంటపాటు గాల్లో ఉండే సామర్థ్యం, తిరిగి వెనక్కి రప్పించి మళ్లీ వాడుకునే వెసులుబాటు దీని స్పెషల్.

వేగుచుక్క

# కరువును ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ

**హైదరాబాద్, అక్టోబర్ 23:**



ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువును ముందుగానే అంచనా వేసి తాగు, సాగునీటి లభ్యతను కాపాడటంతోపాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి వంటి కీలక రంగాలకు రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా సమగ్రంగా కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తీర్మానించింది. నియమిత గడువు ఈనెల 31లోగా కరువు మండలాలను ప్రకటించడంతోపాటు ఎల్‌నినో, కరువు పరిస్థితులను చర్చించడానికి అఖిలపక్ష సమావేశం త్వరలో ఏర్పాటు చేయాలని కమిటీ తీర్మానించింది. కరువు, ఎల్‌నినో పరిస్థితులను అధిగమించేందుకు, తగిన చర్యలను సమీక్షించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి, సబ్‌కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం సచివాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, సంబంధిత శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా విశ్లేషించి నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించి ప్రజలకు అవసరమైన సహాయసహకారాలు సమయానికి అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇప్పటికే కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతోపాటు 20 శాతానికి మించి కరువు ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను కూడా పరిశీలించాలన్నారు. కరువు ప్రభావం వివిధ రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేస్తే ప్రజలకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించేందుకు వీలవుతుందని చెప్పారు. అందుకే ప్రతి శాఖ తన పరిధిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. తాగు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాఖ సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందించేందుకు అన్ని శాఖలు తమ అవసరాలను ముందుగానే అంచనా వేయాలని, అత్యవసర ఖర్చుల కోసం ఆర్థిక శాఖ తగిన విధంగా సహకరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయ రంగంపై కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు రానున్న పంటల సీజన్‌కు అనుగుణంగా నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. సమస్యలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే వాటిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు.

## కరువుపై జిల్లాలవారీగా కార్యాచరణ

**మొదటిపేజీ తరువాయి**

నిధులను అందుబాటులో ఉంచడంతోపాటు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీటి సరఫరా, సాగునీటి అవసరాలు, పంటల రక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు సకాలంలో ఉపశమనం కలిగించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి నివారణ చర్యలను సిఫారసు చేసేందుకు ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం సచివాలయంలో శుక్రవారం జరిగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు, తలెత్తే నీటి కొరత, వ్యవసాయ అవసరాలను అంచనా వేసి, వాటిని ఎదుర్కొనేందుకు స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు నిరంతర సమన్వయంతో పని చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు తక్షణమే స్పందించేందుకు అవసరమైన నిధులు వారి వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. విధానపరమైన ప్రక్రియల కారణంగా సహాయక చర్యల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. నీటిపారుదల, గ్రామీణ తాగునీటి సరఫరా, వ్యవసాయ శాఖలతోపాటు స్థానిక యంత్రాంగం సమన్వయంతో పనిచేసి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు, జలాశయాల్లో నీటి నిల్వలు, సాగునీటి లభ్యత, భూగర్భ జలమట్టాలు, వ్యవసాయ పరిస్థితులు, ఆయా శాఖల సన్నద్ధతను సమావేశంలో సమీక్షించారు. జిల్లాల స్థాయిలో తాగునీటి లభ్యత, సాగునీటి అవసరాలను సమన్వయంతో పర్యవేక్షించాల్సిన అవసరంపై చర్చించారు. రాష్ట్రంలోని 358 మండలాల్లో కరువు సంబంధిత సమస్యలు ఉన్నట్లు సమావేశానికి వివరించారు. వీటిలో 315 మండలాల్లో నిర్దేశిత కరువు అంచనా ప్రమాణాలకు సరిపడే పరిస్థితులు ఉన్నాయని, మరో 43 మండలాల్లో పంట నష్టం ముప్పు ఉందని తెలిపారు. ఈ అదనపు మండలాల్లో పరిస్థితులను కూడా పరిశీలించి ఆధారాలతో కూడిన వివరాలను కేంద్రానికి సమర్పించే వినతిపత్రంలో పొందుపరచడంపై చర్చించారు. వర్తించే పథకాల కింద కేంద్ర సహాయం కోరేందుకు అవసరమైన సమాచారాన్ని సమగ్రంగా సిద్ధం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. మొత్తంగా సుమారు 24 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు సమావేశంలో సమర్పించిన అంచనాలు వెల్లడించాయి. సాగునీటి జలాశయాల్లో నిల్వలు సాధారణ స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉన్నాయని, పలు మండలాల్లో భూగర్భ జలాలపై ఒత్తిడి నెలకొన్నట్లు వివరించారు. వ్యవసాయం, తాగునీటి సరఫరా, గ్రామీణ జీవనోపాధులపై కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు సమగ్ర ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణ, సకాలంలో వనరుల సమీకరణపై సమావేశం దృష్టి సారించింది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## పొలాల్లో కన్నీటి ధార

**మొదటిపేజీ తరువాయి**

పాతాళానికి పడిపోవడంతో.. చివరకు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పొలాలకు పారిస్తున్నారు. ఎల్‌నినో వల్ల భవిష్యత్తులో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తప్పవని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటిస్తూ వస్తోంది. వరి పంటలను సాగు చేయద్దని, నీటి వినియోగం తక్కువగా ఉంటే ఆరుతడి పంటలే వేయాలని జిల్లా అధికార యంత్రాంగం ప్రకటిస్తోందే తప్ప క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లో రైతు శ్యాంసుందర్ రెడ్డి తన ఎనిమిది ఎకరాల వరి పంటకు 4 ట్యాంకర్ల ద్వారా నీటిని పారించాడు. ఈ దృశ్యాలు చూసిన మిగతా రైతులు భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నారు. ముందుముందు తాగు, సాగునీటికి మరింత ముప్పు పొంచివున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు భరోసా కల్పించాలని, ప్రత్యామ్నాయ సాగుపై సమగ్రమైన ప్రణాళికను అమలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

# తుమ్మిడిహెట్టిపై త్వరలో చర్చలు

**హైదరాబాద్, అక్టోబర్ 23 :** తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవలే సూచనప్రాయంగా తెలియజేశారని వెల్లడించారు. బోధి పెవిలియన్‌లో అధికారులతో ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌తోపాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై పీటముడిగా ఉన్న అంశాలన్నింటినీ ఈ సమావేశంలో చర్చించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మిస్తే ఎంత నీటిని తెచ్చుకునే వీలుంది.. 150 మీటర్ల ఎత్తున ఎంత నీటిని ఎల్లంపల్లి వరకు తెచ్చుకునే వీలుందనే వివరాలను ఇరిగేషన్ ఇంజనీర్లు సీఎంకు వివరించారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో మహారాష్ట్ర పరిధిలో ఎక్కడా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని వివరించారు. 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే దాదాపు 2300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల లోపే ముంపు ప్రభావం ఉంటుందని వివరించారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసుకుని సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీ నిర్మించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కేంద్ర జల సంఘం అధ్వర్యంలో దిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశం వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, సీడబ్ల్యూసీ కోరిన సమాచారాన్ని అందజేయాలని కూడా ఆదేశించారు. అటవీ, గిరిజన ప్రాంతం, అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మిస్తున్నామని వివరించారు. అదే లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల చర్చలు, సంప్రదింపులు జరగాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఏళ్లకేళ్లు పోరాడిన అటవీ ప్రాంతవాసులందరికీ ఈ ప్రాజెక్టు ద్వారా మేలు జరగాలన్నారు. అందుకే తుమ్మడిహెట్టి ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజనీర్లను సీఎం ఆదేశించారు. గతంలోనే 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకునేందుకు వీలు కాదని సీఎం అన్నారు. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలను తెలియజేసి, మన వాదనను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సీఎం సూచించారు.

**ఏదుల నుంచే డిండి, అచ్చంపేటకు నీరు**

డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు ఈ అదనపు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడెక్కడ పంపులు, పంప్ హౌస్‌లు అమర్చాలి.. ఇప్పుడున్న కెనాల్స్, టన్నెల్ సిస్టమ్ సామర్థ్యం సరిపోతుందా లేదా, ఎక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవాలనేది ఇరిగేషన్ విభాగం వెంటనే అధ్యయనం చేసి అందుకు వీలైన డిజైన్లు తయారు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. దీంతో పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి కోత పడదని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు నీటి కేటాయింపులకు ఆటంకం లేకుండా ఏదుల నుంచి డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించేలా ఈ పనులు చేపట్టాలని ఆదేశించారు. నార్లాపూర్ నుంచి డిండికి నీటిని తీసుకోవాలా... ఏదుల నుంచి డిండికి నీటిని తీసుకోవాలా అనే విషయంలో మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చవుతుంది, ఏదుల నుంచి నీటిని తీసుకుంటే ఎంత అంచనా వ్యయమవుతుందనే వివరాలన్నీ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనుకూలతలు, ప్రతికూలతలన్నింటినీ వివరించారు. మధ్యేమార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఢోకా లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని లిఫ్ట్ చేసేందుకు వీలుగా అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్, సీఎంవో సెక్రటరీ మాణిక్ రాజ్‌తోపాటు సెక్రటరీ (టన్నెల్) కల్నల్ పరీక్షిత్ మెహ్రా తోపాటు ఇరిగేషన్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, అన్ని ప్రాజెక్టుల సీఈలు పాల్గొన్నారు.

# కరువును కలిసికట్టుగా ఎదుర్కొందాం.

**మొదటిపేజీ తరువాయి**

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా ప్రపంచవ్యాప్తంగా దాదాపు వంద దేశాలు ఈ ఎల్‌నినో ప్రభావంతో కరువును ఎదుర్కొంటున్నాయని వివరించారు. ప్రజా భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు తదితరులు హాజరు కాగా ఎల్‌నినో, ఎమ్మెల్సీ ఎన్నికలపై సీఎం దిశానిర్దేశం చేశారు. కరవు ప్రారంభమైనప్పుడు మొదట మనకు దాని ప్రభావం తెలియదు.. నెమ్మదినెమ్మదిగా కబళిస్తుంది.. ఆరు నెలల నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం అని చెప్పారు. అక్టోబర్ నుండి జూలై వరకు ఎండ వేడి విపరీతంగా పెరిగి నీటి ఆవిరి ఎక్కువవుతుందని, ఫలితంగా నీటి అందుబాటు తగ్గుతుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఉష్ణోగ్రతలు పెరిగి నీటి కొరత వల్ల విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతుందని హెచ్చరించారు. సాధారణంగా ఈ సీజన్‌లో 13 వేల మెగావాట్లకు మించని విద్యుత్ వినియోగం ప్రస్తుతం అనూహ్యంగా 20 శాతం పెరిగి 20వేల మెగావాట్లకు చేరుకుందని తెలిపారు. అయినప్పటికీ అధికారులు, డిప్యూటీ సీఎం 24 గంటలు కష్టపడి విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని కొనియాడారు.

**తాగునీటికే ప్రాధాన్యం**

రాష్ట్రంలో ప్రాజెక్టుల నీటి నిల్వలు 20 శాతం కూడా లేవని, మొత్తం 200 టీఎంసీలు కూడా లేక డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయని సీఎం పేర్కొన్నారు. 30 లక్షల పంప్‌సెట్లలో 15 లక్షలు ఎండిపోయాయని, సాగునీటి కంటే తాగునీటి సమస్యే తీవ్రంగా మారనుందని తెలిపారు. ఈ పరిస్థితిని దాచిపెడితే క్యాన్సర్‌లా మారుతుందని, అందువల్లే రాబోయే 8 నుండి 10 నెలలపాటు నిజాన్ని ప్రజలకు వివరించి సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వ్యవసాయానికి పూర్తిస్థాయి నీరు ఇవ్వడం సాధ్యపడదని, అందువల్ల రైతులు వరి సాగుకు బదులు ఆరుతడి పంటలు, కూరగాయల సాగు మాత్రమే చేపట్టేలా రైతు వేదికల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి పశుగ్రాసం, తాగునీరు అందించేందుకు ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

**సబ్ కమిటీ ఏర్పాటు – ప్రత్యేకాధికారి**



**నియామకం**

కరువు పరిణామాలను పర్యవేక్షించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టి ప్రజల్లో సరైన అవగాహన కల్పించడానికి ప్రభుత్వ మాజీ కార్యదర్శి రామకృష్ణారావును ఎల్‌నినో ప్రత్యేక అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. కరోనా సమయంలో బాధ్యతారాహిత్యంగా మాట్లాడి ప్రజలను కేసీఆర్ మోసం చేశారని, అలాంటి తప్పుడు మాటలు నమ్మవద్దని కోరారు. సోనియా గాంధీ దూరదృష్టితో తెచ్చిన ఉపాధి హామీ నాడు ప్రజలకు ఉపాధి కల్పించిందన్నారు. గతంలో ఏడు రకాల సన్న వడ్లకు బోనస్ ఇస్తామంటే విమర్శలు చేశారని, కానీ రైతులు నమ్మి పండించడంతో ఈరోజు మార్కెట్‌లో రూ.3,400 నుండి రూ.4,000 వరకు మంచి ధర లభించిందని ఉదహరించారు.

**'సర్' సభకు పిలుపు**

అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన పీపుల్స్ రిప్రజెంటేషన్ యాక్ట్‌కు భంగం కలిగిస్తూ బీజేపీ ప్రభుత్వం దురుద్దేశంతో 'సర్' ప్రక్రియను ఉపయోగిస్తోందని సీఎం మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పోరాడుతున్నారని తెలిపారు. నవంబర్ 1న దిల్లీలో రాహుల్ గాంధీ నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రాష్ట్రం నుంచి పదివేల నుండి 15వేల మంది తరలివెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు ఎన్నికలు, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం కొత్త కాదని, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులకు మార్గదర్శనం చేశారు.

**ఎమ్మెల్సీ ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలి**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సీఎం పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎన్నికల్లో ప్రతిసారీ ఓటు హక్కును నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ నియోజకవర్గాల్లో గతంతో పోల్చితే ఇప్పటివరకు 36 శాతం ఓట్లు మాత్రమే నమోదయ్యాయి. ఇంకా 64 శాతం ఓట్లు నమోదు కావాలి. యువకులు సామా రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని పార్టీ ఎంపిక చేసింది. బెస్ట్ క్యాండిడేట్స్‌ను ఎంపిక చేసింది. అందరం కలిసి గెలిపించుకోవాలి అని పిలుపునిచ్చారు. బీఆరఎస్, బీజేపీ దొంగదెబ్బ తీయాలని ప్రయత్నిస్తున్నాయి. వెనుక అలాయ్ బలాయ్ చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు అభ్యర్థులకు మాత్రమే సంబంధించినవి కావు.. పార్టీకి కూడా సంబంధించినవి. గెలిపించి తీరాలి.. ఎన్నికలు లేని జిల్లాలకు చెందిన నాయకులకు బాధ్యతలు అప్పగించాలి అని సూచించారు.

**తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి**

కేబినెట్ సబ్ కమిటీతోపాటు అన్ని స్థాయిల్లో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసి తాగునీటిని అందించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా టోల్ ఫ్రీ నంబర్ ఇవ్వాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు, ఎనఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కూడా ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. విద్యుత్‌ను ఎంత ఖర్చు పెట్టి అయినా కొనడానికి సిద్ధంగా ఉన్నా మార్కెట్‌లో అందుబాటులో లేదని తెలిపారు. అవసరం లేకుండా విద్యుత్ వాడొద్దని ప్రజలకు సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలన్నారు. కొండారెడ్డిపల్లిలో గ్రామస్తులు సోలార్ విద్యుత్‌ను అమ్మడం ద్వారా లబ్ధి పొందారని గుర్తు చేశారు. బీఆరఎస్ హయాంలో నాలుగు వేల మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్‌కు రూ.8 వేల కోట్లు అదనంగా ఖర్చు అయిందని, యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు రూ.6కు పైగా పెరిగిందని, సింగరేణిలో లభ్యం కాని జీ9 బొగ్గుతో యాదాద్రిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తామని చెప్పారని, విదేశాల నుంచి కృష్ణపట్నం పోర్టు ద్వారా బొగ్గును దిగుమతి చేసుకుని యాదాద్రిలో విద్యుత్ ఉత్పత్తి చేయాలని చూశారని విమర్శించారు. రామగుండం, కొత్తగూడెం, మంచిర్యాల వంటి ప్రాంతాల్లో యాదాద్రిని నిర్మిస్తే రూ.28 వేల కోట్లతో 2019 నాటికి పూర్తి అయ్యేదని, ఏటా రూ.2 వేల కోట్ల బొగ్గు రవాణా భారం తగ్గేదని చెప్పారు. నైని ప్రాంతానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెళ్లి స్థానికులతో మాట్లాడి బొగ్గు తీసుకువస్తున్నామన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మాట్లాడి మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి కూడా యాదాద్రికి బొగ్గు తీసుకొస్తున్నామని, యాదాద్రిలో ఒక్కొక్క యూనిట్‌ను పట్టాలెక్కిస్తున్నామని చెప్పారు.

**రైతులకు విద్యుత్ ఇవ్వడంలో అద్భుతమైన విజయం**

విద్యుత్ విషయంలో ప్రభుత్వం బాగా పనిచేసిందని, రైతులకు విద్యుత్ ఇవ్వడంలో అద్భుతమైన విజయం సాధించామని రేవంత్‌రెడ్డి చెప్పారు. మోదీ ఎన్ని పేర్లు మార్చినా అది ఎప్పటికీ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకమేనన్నారు. సంక్రాంతి తర్వాత మే వరకు నాలుగు నెల పాటు ప్రత్యేక పథకాన్ని తీసుకువస్తామని, కేంద్రం నుంచి వచ్చే నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున ఈ పథకం కోసం ఖర్చు పెట్టబోతోందని తెలిపారు. ప్రతి ప్రజాప్రతినిధి గ్రామాలకు వెళ్లాల్సిందేనని, అందరి ఫోన్లలో ప్రత్యేక యాప్ పెట్టి పర్యవేక్షణ చేస్తామంటూ వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులు, కాలువలు, చెరువులు, కుంటలను పునరుద్ధరించుకోవడానికి ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రైతులను ఉత్తేజపరచడానికి కళాజాతాలను సిద్ధం చేయాలన్నారు. గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్ నేతృత్వంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. హరీశ్‌రావు అసూయ, ద్వేషంతో ఏ మాటలు మాట్లాడినా పట్టించుకోవద్దు అని ప్రజలకు, పార్టీ శ్రేణులకు సూచించారు. చేతినిండా పని.. కడుపు నిండా భోజనం.. ఇదే మన కార్యాచరణ. విద్యుత్ ఇచ్చినా బోర్లలో నీళ్లు లేవు. పెట్టుబడి కూడా పోతుందన్నారు. వచ్చే వానాకాలంలో బ్రహ్మాండమైన పంటలు పండించుకోవచ్చునని చెప్పారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై ఈడీ ఉక్కుపాదం

- హైదరాబాద్, విజయవాడల్లో ఏజెంట్లు, హవాలా నిర్వాహకులపై సోదాలు
- 200కు పైగా షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లింపు
- క్రిప్టోకరెన్సీ రూపంలో దుబాయ్‌కు నగదు తరలింపు
- ఎడ్‌సోమ్ ఫిన్‌టెక్ వ్యవస్థాపకుడు రాంధానీ అరెస్టు

**హైదరాబాద్, అక్టోబరు 23:** ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ద్వారా సాగుతున్న అక్రమ లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. గతవారం మహారాష్ట్ర, గుజరాత్‌లలో నిర్వహించిన సోదాల్లో లభించిన ఆధారాల ఆధారంగా తాజాగా హైదరాబాద్, విజయవాడల్లో స్థానిక ఏజెంట్లు, హవాలా నిర్వాహకులపై దాడులు చేపట్టింది. పుణె సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ విచారణ చేపట్టింది. గతవారం ముంబై, పుణె, సూరత్, మెహసానాలో 20కి పైగా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. 'ఐపైసా' వంటి గేమింగ్, చెల్లింపుల వేదికల ద్వారా అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలు సాగించినట్లు గుర్తించింది. బెట్టింగ్ ద్వారా సంపాదించిన సొమ్మును నేరుగా తరలించకుండా దేశవ్యాప్తంగా 200కు పైగా షెల్ కంపెనీలు, పలు సహకార బ్యాంకుల ఖాతాల ద్వారా మళ్లించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం క్రిప్టోకరెన్సీగా మార్చి దుబాయ్‌తో పాటు ఇతర విదేశీ ఖాతాలకు తరలించినట్లు సాంకేతిక ఆధారాలు లభించాయి. గతవారం సోదాల్లో హార్డ్‌డిస్క్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక లావాదేవీల రికార్డులను స్వాధీనం చేసుకున్న ఈడీ.. అనుమానాస్పద బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఎడ్‌సోమ్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రాంధానీని అరెస్టు చేసి విచారించింది. ఆ విచారణలో వెల్లడైన వివరాలు, స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాల ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లో తదుపరి చర్యలు చేపట్టినట్లు సమాచారం

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు తక్షణమే ఇవ్వాలి.





- రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్.
- జర్నలిస్టులు సమాజానికి దిక్సూచిలా ఉండాలి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టిడబ్ల్యూజేఎఫ్ బలోపేతానికి కృషి
- టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టిపాటి రాజశేఖర్.

**వేగుచుక్క న్యూస్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ, అక్టోబర్ 23:**

జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల జేఏసీతో చర్చించి ఇండ్ల స్థలాలపై తక్షణమే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) డిమాండ్ చేసింది. శుక్రవారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సమావేశం రాష్ట్ర నాయకులు రాళ్ళ బండి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టిపాటి రాజశేఖర్ మాట్లాడుతూ, జర్నలిస్టులు సమాజంలోని అవినీతిని వెలికి తీసి సమాజానికి ఆదర్శంగా ఉండాలని, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ కృషి చేస్తుందని చెప్పారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్రంలోని ఇతర జర్నలిస్టు యూనియన్లకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. జర్నలిజం పరుగుల ప్రయాణంలో విలువలు దిగజారకుండా పని చేయాలని సూచించారు. ఫెడరేషన్ లో వర్కింగ్ జర్నలిస్టులు మాత్రమే సభ్యులుగా, నాయకులుగా ఉన్నారని తెలిపారు. ఫెడరేషన్ కృషి ఫలితంగానే ప్రభుత్వం జీవో 252 సవరించిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫెడరేషన్ ను బలపర్చాలని కోరారు. త్వరలో హైదరాబాదులో జరిగే టీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర మహాసభల విజయవంతానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ పూర్తి సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని కోరారు.

**జర్నలిస్టుల హక్కుల కోసం ఆమరణ నిరాహారదీక్షకు సిద్ధం: టిడబ్ల్యూజేఎఫ్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఖదీర్.**

జర్నలిస్టుల హక్కులు సాధించడం కోసం ఎంతటి పోరాటాల కైనా టిడబ్ల్యూజేఎఫ్ సిద్ధమని డబ్ల్యూ జేఎఫ్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం జిల్లాలో చేసిన పాదయాత్ర రాష్ట్రంలోనే చర్చనీయాంశంగా మారిందన్నారు. సంక్షేమ పథకాల కోసం పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర సంఘాలు చేయలేని పోరాటాలు ఖమ్మం జిల్లా టి డబ్ల్యూజెఎఫ్ నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వాలు జర్నలిస్టులను మభ్య పెట్టేందుకు తూతూ మంత్రంగా హామీలు ఇస్తున్నాయి తప్ప, అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వాలకు కొమ్ముకాస్తున్న యూనియన్లు వలన వర్కింగ్ జర్నలిస్టు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించిన ఘనత తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ దే అని ఉద్ఘాటించారు.

**టిడబ్ల్యూజేఎఫ్ పోరాటాల నుండి పుట్టింది: శ్రీనివాస్ రెడ్డి.**

పోరాటాల నుంచే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఉద్భవించిందని ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఖమ్మంలో చేసిన పాదయాత్ర వలన ఇతర యూనియన్లు విమర్శలు చేశాయని, అనేక ప్రతిబంధకాలను అధిగమించి పాదయాత్రను విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు.

**పోరాడి సాధించుకోవాలి: టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం ఉపాధ్యక్షులు సాగర్.**

ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు సుముఖంగా లేవని, బలంగా, ఐక్యంగా ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సాగర్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టీ డబ్ల్యూజెఎఫ్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అందరూ ఐక్యంగా పనిచేసి యూనియన్ పటిష్టం చేయాలని కోరారు.

వర్కింగ్ జర్నలిస్టు లందరికీ అక్రిడియేషన్ కార్డులు, బస్సు పాసులు, హెల్త్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నాయకులు పారుపల్లి కృష్ణారావు అన్నారు. ఈ సన్నాహాగా సమావేశంలో టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు దాసరి వెంకటేశ్వరరావు, టిఎస్ చక్రవర్తి, టిడబ్ల్యూజేఎఫ్ సీనియర్ నాయకులు సూరిబాబు, నాగవర్మ , జానీ పాషా, టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా నాయకులు తేనె వెంకటేశ్వర్లు, నాగేంద్ర రెడ్డి ఇమ్మంది ఉదయ్ కుమార్, కోదారి వెంకటేశ్వర్లు, ప్రవీణ్, సిహెచ్ వి. నరసింహారావు, సురేష్, వేణుగోపాల్, రాధాకృష్ణ, ఎన్. రమేష్, రాజేందర్, ఎస్ వి. సంతోష్, సతీష్, మోహన్ రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలి.

**ప్రభుత్వానికి టిడబ్ల్యుజెఎఫ్ విజ్ఞప్తి.**

**బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేసిన ఫెడరేషన్ నాయకులు.**

**ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.**



**వేగుచుక్క న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ, అక్టోబర్ 23:**

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టిపాటి రాజశేఖర్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎస్కే ఖదీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెంలోని లక్ష్మీనారాయణ నివాసానికి వెళ్లిన టీడబ్ల్యూజేఎఫ్ బృందం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించింది. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ఆయన మృతికి దారితీసిన పరిస్థితులను వివరిస్తూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. లక్ష్మీనారాయణ ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన వారిని చట్టప్రకారం శిక్షించాలని ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేక చొరవ తీసుకొని విచారణను వేగవంతం చేయాలని, అనంతుల లక్ష్మీనారాయణకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కరోనా మహమ్మారి సమయంలో, గ్యాస్ కొరత ఏర్పడిన సందర్భాల్లో, యుద్ధ పరిస్థితుల ప్రభావం ఉన్న సమయంలోనూ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సేవలందించారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా పలు అవార్డులు కూడా అందుకున్నారని పేర్కొన్నారు. ఎంతో నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగి మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని, అంతర్గత విచారణను నిష్పాక్షికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు, కుటుంబంలోని ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించేలా ప్రభుత్వం, చర్యలు తీసుకోవాలనీ, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాళ్ల బండి కృష్ణమూర్తి టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు దువ్వసాగర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు పి. కృష్ణారావు, సూరిబాబు , కొడాలి వెంకటేశ్వర్లు, వేణు, రమేష్ కుమార్, నందిపాటి రమేష్, జలాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందూరులో 'హనుమాన్ కథ' వైభవం అద్భుతం..







### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ..

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



హనుమాన్ కథ వైభవం ప్రవచన రూపంలో అందించడం ఎంతో అద్భుతంగా ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం నగరంలోని శ్రద్ధానంద్ గంజిలో నిర్వహించిన హనుమాన్ కథ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అయోధ్య శ్రీరామ జన్మభూమి ట్రస్ట్, గీత పరివార్ అధ్యక్షులు శ్రీ గోవిందు గిరిజి మహారాజ్ ఇందూరుకు రావడం, హనుమాన్ కథ వినిపించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సాధారణంగా హనుమంతుడి చరిత్ర అందరికీ తెలుసని, కానీ తెలియని విషయాలు ప్రవచన రూపంలో స్వామీజీ అందజేశారన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన రమేష్ కుమార్, సురేష్ కుమార్ డాలియా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి యువత హిందూ దేవుళ్ళ చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆధునికత, సాంకేతికతతో పాటు ఆధ్యాత్మిక వైపు కూడా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, కార్పొరేటర్లు బట్టు రాఘవేందర్, మల్కాయి మహేందర్, నాయకులు పంచారెడ్డి శ్యామ్, పవన్ ముందడ, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'టవర్స్' నిర్మాణానికి స్థలాలు గుర్తించాలి

**మొదటిపేజీ తరువాయి**

రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఒకవైపు ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూనే మరోవైపు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన భూములను యుద్ధప్రాతిపదికన గుర్తించాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని నియోజకవర్గాల వారీగా మొదటి విడత నిర్మాణాలకు అవసరమైన స్థలాల గుర్తింపును పూర్తిచేయడంతోపాటు, రెండో, మూడో విడతల్లో చేపట్టనున్న నిర్మాణాలకు కూడా ముందుగానే భూములను సిద్ధం చేయాలని కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, హౌసింగ్ శాఖ అధికారులతో మంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం, రెండో, మూడో విడతలకు అవసరమైన భూముల గుర్తింపు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం**

క్యూర్ పరిధిలోని పేదలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు నిర్మించి అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మంత్రి పొంగులేటి తెలిపారు. నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. పేదవాడికి సొంత ఇంటిని అందించడం కంటే తమ ప్రభుత్వానికి మరే అంశమూ ప్రాధాన్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. భూముల గుర్తింపు నుంచి నిర్మాణాల ప్రారంభం వరకు ప్రతి దశలోనూ నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని, స్థలాల ఎంపికలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

**క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యం**

క్యూర్ పరిధిలో మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గంలో సుమారు 500 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నామని వెల్లడించారు. మొదటి విడతకు సంబంధించి రెండు, మూడు నియోజకవర్గాలకు అవసరమైన స్థలాల గుర్తింపును వేగవంతం చేయాలని, మిగిలిన నియోజకవర్గాల్లో రెండో, మూడో విడతల నిర్మాణాలకు అవసరమైన భూములను కూడా ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్లను ఆదేశించారు. భూముల లభ్యత, స్థలాల అనుకూలత, ఇతర అవసరమైన అంశాలపై అధికారులు నిరంతరం పర్యyక్షించాలని సూచించారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఎంపికలో పారదర్శకతకు పెద్దపీట**

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి లబ్ధిదారుల ఎంపికకు డ్రా నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారుల వివరాలన్నింటినీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసి ఆన్‌లైన్ విధానంలో డ్రా నిర్వహించడం ద్వారా ఎంపిక ప్రక్రియలో పారదర్శకతను మరింత పెంచవచ్చని, డ్రా ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేయాలని, ప్రత్యక్షంగా వీక్షించలేని వారు కూడా డ్రాకు సంబంధించిన వివరాలను యూట్యూబ్‌లో తమ వివరాలు ఎంపిక జాబితాలో ఉన్నాయో లేదో ఎప్పుడైనా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఖేలో ఇండియా' నిర్వహణకు పక్కా కార్యాచరణ

**హైదరాబాద్, అక్టోబర్ 23 :**

రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతోందని యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, క్రీడాకారుల ఎంపిక, స్టేడియాల సిద్ధత, శిక్షణ తదితర అంశాలపై సచివాలయంలో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 27 రకాల క్రీడాంశాల్లో 1:4, 1:2, 1:1 నిష్పత్తుల ఆధారంగా క్రీడాకారులను దశలవారీగా గుర్తించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఖేలో ఇండియా పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు. క్రీడాకారుల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిభ ఆధారంగానే అవకాశాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేవలం పోటీల నిర్వహణకే పరిమితం కాకుండా రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు.

**స్టేడియాల సిద్ధత.. క్రీడాకారులకు పోషకాహారం**

ఖేలో ఇండియా పోటీలు నిర్వహించే క్రీడా వేదికలు, స్టేడియాలను గుర్తించి వాటిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా పరికరాలు, ఇతర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి శ్రీహరి ఆదేశించారు. పోటీల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. క్రీడాకారుల శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందించేందుకు నాణ్యమైన శిక్షణతో పాటు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని ప్రభుత్వ పరంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వైద్య సహాయం, వసతి, రవాణా వంటి సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

**దేశానికే ఆదర్శంగా నిర్వహణ**

ఖేలో ఇండియా గేమ్స్ దేశానికే దిక్సూచిగా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి శ్రీహరి ఆకాంక్షించారు. క్రీడాకారులకు అత్యుత్తమ వసతులు కల్పిస్తూ, పోటీల నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని చెప్పారు. ఈ పోటీలు రాష్ట్ర క్రీడా రంగానికి కొత్త దిశానిర్దేశం చేయడంతోపాటు రాష్ట్ర యువతలో క్రీడల పట్ల ఆసక్తిని మరింత పెంచేలా ఉండాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ క్రీడల సలహాదారు, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్ మల్లారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, రవితేజ, అశోక్, శ్రీనివాస్, ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# తల్లి కోసం కొడుకు సంకల్పం..

- తల్లి కోలుకోవడంతో మొక్కు తీర్చుకుంటున్న 19 ఏళ్ల మోనూ
- ఇప్పటివరకు ఆరు జ్యోతిర్లింగాల దర్శనం
- రోజుకు 50 కిలోమీటర్లు పరిగెత్తుతున్న బిహార్ యువకుడు
- మిగిలిన ఆరు క్షేత్రాల దర్శనం తర్వాతే ఇంటికి వెళ్లాలని సంకల్పం

బిహార్‌కు చెందిన 19 ఏళ్ల మోనూ మెటుర్కాలా తల్లి ఆరోగ్యం కోసం చేసిన మొక్కును తీర్చుకునేందుకు ద్వాదశ జ్యోతిర్లింగాల యాత్ర చేపట్టాడు. 2026 మార్చి 15న పాట్నా నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో ఇప్పటివరకు సుమారు 8 వేల కిలోమీటర్లు ప్రయాణించి ఆరు జ్యోతిర్లింగాలను దర్శించుకున్నాడు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న అతడు రోజుకు 50 కిలోమీటర్లు పరిగెత్తుతూ మిగిలిన క్షేత్రాలను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మోనూ తల్లి లలీ్తదేవి గొంతులో చేప ముల్లు ఇరుక్కోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆమె కోలుకోవాలని పరమశివుడిని ప్రార్థించిన మోనూ, ఆరోగ్యం బాగుపడితే జ్యోతిర్లింగాలను దర్శిస్తానని మొక్కుకున్నాడు. కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేందుకు పానీపూరీ విక్రయించే అతడు, ఆర్థిక ఇబ్బందులున్నా యాత్రకు బయలుదేరాడు. మరో ఇద్దరు యువకులు కూడా అతడికి తోడుగా ప్రయాణిస్తున్నారు. కుమారుడు మొక్కును నెరవేర్చుకుంటుండటంపై తల్లి ఆనందం వ్యక్తం చేస్తుండగా, యాత్ర ముగించుకుని క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు.



## వందేమాతరం ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో పిటిషన్

- ఆరు చరణాల గేయాన్ని తప్పనిసరి చేయడంపై అభ్యంతరం
- కేంద్రం ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఐఏఎస్ అధికారి వాదన
- తొలి రెండు చరణాలనే జాతీయ గేయంగా గుర్తించాలని విజ్ఞప్తి
- మత విశ్వాసాల కారణంగా పాడని వారిపై చర్యలు తీసుకోవద్దని అభ్యర్థన

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:**

ప్రభుత్వ, విద్యా కార్యక్రమాల్లో ఆరు చరణాల 'వందేమాతరం' గేయాన్ని ఆలపించాలంటూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేరళకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి బాలకృష్ణన్ సత్యభామ మావోజీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది జనవరి 28, జులై 9 తేదీల్లో జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగానికి విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'ఆనందమఠ్' నవలలోని పూర్తి గేయంలో హిందూ దేవతల ప్రస్తావనలు, మతపరమైన అంశాలు ఉన్నాయని, దానిని ఆలపించాలని బలవంతం చేయడం మనస్సాక్షి స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని పిటిషనర్ వాదించారు. రాజ్యాంగంలోని 14, 19, 21, 25, 28 అధికరణలకు ఇవి విరుద్ధమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జాతీయ గేయంగా గుర్తింపు పొందిన తొలి రెండు చరణాలు మాతృభూమి గొప్పదనాన్ని మాత్రమే వర్ణిస్తాయని తెలిపారు. రవీంద్రనాథ్ ఠాగూర్, 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కూడా తొలి రెండు చరణాలనే ఆమోదించాయని గుర్తుచేశారు. కేంద్రం ఉత్తర్వులను రద్దు చేసి, తొలి రెండు చరణాలనే అధికారికంగా జాతీయ గేయంగా ప్రకటించాలని, మత విశ్వాసాల కారణంగా గేయాన్ని ఆలపించని వారిపై చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని కోరారు. ఇదే అంశంపై సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ సహా మరికొందరు గతంలోనూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## రైహాన్ ఫొటో ఎగ్జిబిషన్‌పై కాంగ్రెస్‌లో విభేదాలు

- రాహుల్ మౌనంపై ప్రదీప్ భండారీ విమర్శలు
- 105 ఫొటోల్లో 74 తొలగింపు లేదా మార్పునకు సూచన
- రాజకీయ ఫొటోల చేర్పుపై బికనేర్ హౌస్ అభ్యంతరం
- కుమారుడిని రాజకీయాల్లోకి తెచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఆరోపణలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:**

కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్ వివాదం రాజకీయ ఆరోపణలకు దారితీసింది. ఈ వ్యవహారంలో రాహుల్ గాంధీ మౌనంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ, కాంగ్రెస్‌లో ప్రియాంక-రాహుల్ మధ్య విభేదాలు ఉన్నాయని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. రైహాన్‌ను రాజకీయాల్లోకి తీసుకురావడానికి ప్రియాంక ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలోని బికనేర్ హౌస్‌లో 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో నిర్వహించాలనుకున్న ప్రదర్శనలో 105 ఫొటోల్లో 74 ఫొటోలను తొలగించాలని లేదా మార్చాలని నిర్వాహకులు సూచించడంతో చివరకు 35 ఫొటోలతోనే ప్రదర్శన ప్రారంభమైంది. విద్యార్థుల నిరసనలకు సంబంధించిన చిత్రాలను తొలగించడంపై ప్రియాంక అభ్యంతరం వ్యక్తం చేయగా, వేదిక నిబంధనలకు అనుగుణంగా లేని ఫొటోలను మాత్రమే తొలగించామని బికనేర్ హౌస్ తెలిపింది. మొదట రైహాన్ పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, కళాఖండాలు, పోర్ట్రెయిట్స్ వంటి అంశాలే ఉన్నాయని, తర్వాత రాజకీయ ఫొటోలు చేర్చారని ఈమెయిల్ వివరాలను ఉటంకిస్తూ భండారీ పేర్కొన్నారు. కుటుంబ ఒత్తిడితోనే రాజకీయ అంశాలు చేర్చారన్నది బీజేపీ ఆరోపణ కాగా, ఈ వివాదంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

# విఫలమైన ఉత్పత్తి'ని ప్రమోట్ చేసేందుకు దేశాన్ని పణంగా పెడతారా?

- కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు
- 'దిమాగీ నక్సల్స్' ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తున్నారు
- విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ఆరోపణ
- పార్లమెంటులో ఇతర ప్రతిపక్ష నేతల గొంతు నొక్కుతున్నారని వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:**

"తమ విఫలమైన ఉత్పత్తిని ప్రమోట్ చేసేందుకు కాంగ్రెస్ ఇంకా ఎంతకాలం దేశాన్ని పణంగా పెడుతుంది?" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తూ, ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని 'దిమాగీ నక్సల్స్' తమ ఆధీనంలోకి తీసుకున్నారని ఆరోపించారు. గురువారం ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రసంగించిన ఆయన.. అంతర్జాతీయ పరిణామాలు, భారతదేశ ప్రతిష్ఠ, పార్లమెంటులో ప్రతిపక్షాల వ్యవహారశైలిపై వ్యాఖ్యలు చేశారు.

ప్రపంచం కొత్త అంతర్జాతీయ వ్యవస్థ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో భారత్ తన బలాన్ని, స్థిరత్వాన్ని ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉందని మోదీ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో దేశం ఐక్యతతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విదేశాలకు వెళ్లి భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు చేయడంతో పాటు, దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని కోరుతోందని ఆరోపించారు.

'దిమాగీ నక్సల్స్' కాంగ్రెస్ ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తున్నారని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ కారణంగా ఆ పార్టీ స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని కోల్పోయిందని విమర్శించారు. గతంలో అడవుల్లో విధ్వంసానికి పాల్పడినవారు ఇప్పుడు కాంగ్రెస్‌లోకి చొరబడి దేశానికి నష్టం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వ్యవహారశైలి వల్ల ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా విమర్శించాలనుకునే ఇతర ప్రతిపక్ష నేతలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.

ఒక రాజకీయ కుటుంబ ప్రయోజనాల కోసం దేశ అభివృద్ధి, విజయాలను వివాదాల్లోకి లాగడం సరికాదని మోదీ పేర్కొన్నారు.

కాంగ్రెస్ తన రాజకీయ పతనానికి తానే కారణమవుతోందని వ్యాఖ్యానించారు. పార్టీ సీనియర్ నేతలు అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ బహిరంగంగా మాట్లాడటం లేదని ఆరోపించారు. పార్టీ నాయకత్వంపై విమర్శలు వచ్చినప్పుడు దేశ విజయాలు, ప్రభుత్వ సంస్థల పనితీరును కూడా రాజకీయ వివాదాల్లోకి తీసుకొస్తున్నారని విమర్శించారు.

పార్లమెంటులో కాంగ్రెస్ నిరసనలు, గందరగోళం కారణంగా ఇతర ప్రతిపక్ష పార్టీల యువ ఎంపీలు ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు తగిన అవకాశం దక్కడం లేదని ప్రధాని అన్నారు. ఒకే నాయకుడిని రాజకీయంగా ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఇతర ప్రతిపక్ష నేతల గొంతులను అణచివేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను విమర్శించడం, ప్రజా సమస్యలపై నిరసనలు చేపట్టడం ప్రజాస్వామ్యంలో సహజమని పేర్కొంటూనే, నిర్మాణాత్మకంగా సమస్యలను ప్రస్తావించే ప్రయత్నాలను కూడా కాంగ్రెస్ దారి మళ్లిస్తోందని విమర్శించారు.



ఇతర ప్రతిపక్ష పార్టీల రాజకీయ ఎదుగుదలకు అడ్డుపడుతున్న కాంగ్రెస్‌ను మోదీ 'పరాన్న జీవి'గా అభివర్ణించారు. కాంగ్రెస్ వైఖరి వల్ల ప్రభుత్వాన్ని నిర్మాణాత్మకంగా విమర్శించాలనుకునే నేతల స్వరాలు కూడా ప్రజలకు వినిపించడం లేదని అన్నారు.

# ఎల్‌ఏసీ వద్ద ఉద్రిక్తతలపై కేంద్రం స్పందన

- చైనా సైన్యం గస్తీ విధానాల నుంచి తప్పుకుంటే ఉద్రిక్తతలు: విదేశాంగ శాఖ
- సరిహద్దు సమస్యల పరిష్కారానికి భారత్-చైనా చర్చలు
- సరిహద్దు యూనిట్లలో డ్రోన్ ప్లాటూన్లు ఏర్పాటు
- గల్వాన్ తరహా పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:**

అరుణాచల్‌ప్రదేశ్‌లో భారత్‌చైనా వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి ఉద్రిక్తతలపై ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డీజీ శత్రుజీత్ సింగ్ కపూర్ చేసిన వ్యాఖ్యలపై విదేశాంగ శాఖ స్పందించింది. చైనా సైనికులు గతంలో అంగీకరించిన గస్తీ విధానాలను పాటించనప్పుడు సరిహద్దు ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించేందుకు భారత్‌చైనా ద్వైపాక్షిక సంబంధాలు కీలకమని ఆయన పేర్కొన్నారు. ఎల్‌ఏసీ వెంబడి ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు అపార్థాలు, తప్పుడు అంచనాలను నివారించేందుకు ఇరు దేశాలు దౌత్య, సైనిక మార్గాల్లో చర్చలు కొనసాగిస్తున్నాయని వివరించారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సైనికులతో ఘర్షణ పరిస్థితులు కొనసాగుతున్నాయన్న ఐటీబీపీ డీజీ వ్యాఖ్యలపై మరిన్ని వివరాల కోసం రక్షణ మంత్రిత్వ శాఖను సంప్రదించాలని సూచించారు. సరిహద్దు నిర్వహణను మెరుగుపరిచేందుకు



ఎల్‌ఏసీపై ఇరు దేశాల అవగాహనను పెంచే మార్గాలపై చర్చించేందుకు భారత్, చైనా అంగీకరించాయని తెలిపారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఐటీబీపీ డీజీ శత్రుజీత్ సింగ్ కపూర్ మాట్లాడుతూ.. సరిహద్దు భద్రతను బలోపేతం చేసేందుకు అన్ని సరిహద్దు యూనిట్లలో డ్రోన్ ప్లాటూన్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గల్వాన్ తరహా పరిస్థితులను మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక స్ట్రైక్ శిక్షణ కోర్సులను రూపొందించినట్లు తెలిపారు.

# రూ.326 కోట్ల బ్యాంకు మోసం కేసులో ఈడీ సోదాలు

- కనకధార వెంచర్స్ కార్యాలయాలు, డైరెక్టర్ల నివాసాల్లో తనిఖీలు
- హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్ పరిధిలో ఏడు చోట్ల సోదాలు
- నకిలీ ఇన్‌వాయిస్‌లతో నిధుల మళ్లింపు
- కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం

**హైదరాబాద్, అక్టోబరు 23:**

బ్యాంకుల కన్సార్టియంను మోసగించి రూ.326.49 కోట్ల నిధులను దారిమళ్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కనకధార వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు




నిర్వహించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ)2002 కింద హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్‌మల్కాజ్‌గిరి పరిధిలో శుక్రవారం ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది.

కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయం, డైరెక్టర్ల నివాసాలతో పాటు నిధుల మళ్లింపులో మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్న సంస్థలు, వ్యక్తులకు చెందిన ప్రాంగణాల్లో సోదాలు జరిగాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదు మేరకు సీబీఐ బెంగళూరు విభాగం 2022 డిసెంబరు 8న నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఐపీసీ సెక్షన్లు 120బి, 420, 468, 471తో పాటు అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన కేసులో మనీలాండరింగ్ కోణాన్ని పరిశీలిస్తోంది.

పంజాబ్ నేషనల్ బ్యాంకు నేతృత్వంలోని ఐడీబీఐ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడాలతో కూడిన కన్సార్టియం నుంచి కంపెనీ రుణ సౌకర్యాలు పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బ్యాంక్ గ్యారెంటీలు, లెటర్ ఆఫ్ క్రెడిట్ సదుపాయాలను దుర్వినియోగం చేసి నిధులను మళ్లించినట్లు ఆరోపణలున్నాయి. నకిలీ ఉక్కు కొనుగోలు ఇన్‌వాయిస్‌లు, రవాణా పత్రాలు సృష్టించి, బినామీ సంస్థల ద్వారా డబ్బును ఇతర ఖాతాలకు తరలించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కన్సార్టియం బ్యాంకులకు తెలియకుండా ఇతర బ్యాంకుల్లో ఖాతాలు నిర్వహించినట్లు ఆధారాలు సేకరించారు. తాజా సోదాల్లో నిధుల మళ్లింపు, లేయరింగ్‌కు సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పలు స్థిరాస్తులు, పెట్టుబడులను గుర్తించి వాటి వివరాలను నమోదు చేశారు. కేసులో మరిన్ని ఆధారాల సేకరణకు ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది.

# నేహా బోరా పిటిషన్ కొట్టివేత

- రూ.10 వేల పీస్ బాండ్ నోటీసులపై ఢిల్లీ హైకోర్టు నిర్ణయం
- తిరంగా మార్చ్ సందర్భంగా నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు
- ముందస్తు శాంతిభద్రతల చర్యగానే నోటీసులిచ్చామన్న పోలీసులు
- ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందన్న నేహా బోరా తరఫు న్యాయవాది

**న్యూఢిల్లీ, అక్టోబరు 23:**

ఢిల్లీ నిరసనల నేపథ్యంలో తనకు జారీ చేసిన రూ.10 వేల పీస్ బాండ్ నోటీసులను సవాల్ చేస్తూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరా దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. శాంతిభద్రతలను కాపాడేందుకు పూచీకత్తుతో పాటు వ్యక్తిగత బాండ్ సమర్పించాలని న్యూఢిల్లీలోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అక్టోబరు 17న ఆమెకు నోటీసులు జారీ చేశారు.



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 16న నేహా బోరా వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి తిరంగా మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో ఈ నిరసన చేపట్టారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనలకు విధించిన పరిమితులను ఉల్లంఘించి, ప్రజలను కన్నాట్ ప్లేస్ వైపు వెళ్లేలా ఆమె ప్రేరేపించారని నోటీసుల్లో ఆరోపించారు. కోర్టులో వాదనల సందర్భంగా తాను శాంతిభద్రతలకు భంగం కలిగించలేదని, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఇచ్చిన పిలుపుతో తనకు సంబంధం లేదని నేహా బోరా తరఫు న్యాయవాది పేర్కొన్నారు. నోటీసులు రాజ్యాంగంలోని 19, 21వ అధికరణాల ద్వారా కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నాయని వాదించారు.

ఢిల్లీ పోలీసుల తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ వాదిస్తూ.. నేహా బోరా నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆరోపిస్తున్న 12 సందర్భాలను కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. శిక్ష విధించడం కోసం కాకుండా, ముందస్తుగా శాంతిభద్రతలను కాపాడేందుకే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రశాంత్ భూషణ్, సీజేపీ నాయకులు పాల్గొన్న సమావేశంలో ప్రభుత్వ మార్పునకు పిలుపునిచ్చారని, అందులో నేహా బోరా కూడా ఉన్నారని ఆరోపించారు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ మార్పును కోరుకోవడంలో తప్పులేదని నేహా బోరా తరఫు న్యాయవాది పేర్కొనగా, ప్రభుత్వ మార్పు ఎన్నికల ద్వారా జరగాలని, వీధుల్లో గుంపులుగా చేరి నిరసనలు చేపట్టడం ద్వారా కాదని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం నేహా బోరా పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.